ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ మంత్రి

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి

వనపర్తి టౌన్/గోపాల్‌పేట, నవంబర్ 6 : జిల్లా కేంద్రంలోని వీరాంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులను బుధవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. 3వ వార్డు పాత బజారులో రోడ్ల విస్తరణలో భాగంగా ఆలయం రోడ్డుకు కింది భాగంలో ఉండడంతో నూతన నిర్మాణానికి సంకల్పించి మాజీ మంత్రి వ్యక్తిగతంగా రూ.5లక్షలు ఇచ్చారు. ఆలయ నిర్మాణ కమిటీ ఆహ్వానం మేరకు పనులను పరిశీలించినట్లు జరిగిందని మాజీ మంత్రి చెప్పారు. అలాగే గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అరవింద్, బీఆర్‌ఎస్ నాయకుడు లోకేశ్ వివాహం ఈ నెల 8వ తేదీన ఉండగా వారిద్దరిని మాజీ మంత్రి కలిసి ముందుస్తు పెండ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు మాజీ కౌన్సిలర్ నీలస్వామి, వసంత, నందిమల్ల అశోక్, జాత్రునాయక్, పరంజ్యోతి, మహేశ్వర్‌రెడ్డి, చిట్యాల రాము, లక్ష్మణ్, శివ, తోట శ్రీను, గోపాల్‌పేట మండల అధ్యక్షుడు బొల్లెదుల్ల బాలరాజు, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ సభ్యులు, ఎండీ మతిన్, నాయకులు రాజేశ్‌గౌడ్, మన్యం నాయక్, శరత్ బాబు, సురేందర్, గోపాల్, కృష్ణయ్య, బాలస్వామి, మహేశ్, ఓంకార్ ఉన్నారు.

సర్వే జాగ్రత్తగా చేపట్టాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, నవంబర్ 6 : ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి కుల వివరాల ఇంటింటి కుటుంబ సర్వేను అధికారులు ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా చేపట్టాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గద్వాల మున్సిపాలిటీ పరిధిలో నల్లకుంట, వీవర్స్‌కాలనీ, వడ్లవీధి, ధరూర్ మండలకేంద్రంలోని బీసీ కాలనీలో కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయా ఇండ్లను సందర్శించి కుటుంబ సర్వే కోసం అతికించిన స్టిక్కర్లను పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 1,126 మంది ఎన్యుమరేషన్ బ్లాక్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వంటగది ఆధారంగా ఒక కుటుంబం భావించి సర్వే నిర్వహించాలని,పెండ్లిళ్లు అయినప్పటికీ అందరూ ఒకే గృహంలో ఉన్నట్లైతే ఒకే కుటుంబంగా లెక్కించాలన్నారు. ఖాళీగా ఉన్న గృహాలకు వేకెంట్ అనే స్టిక్కర్ తప్పనిసరిగా వేయాలన్నారు. గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీలతోపాటు ఉదయం తమ విధులు నిర్వహించిన అనంతరం ఉపాధ్యాయులు మధ్యాహ్నం నుంచి సర్వేలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

గట్టు మండలంలో..

గట్టు, నవంబర్ 6 :మండలంలో కులగణన సర్వే బుధవారం ప్రారంభమైంది. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఆలూరులో జరిగిన సర్వేను మండల ప్రత్యేకాధికారి, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ జిల్లా ఏడీ గోవిందయ్య పర్యవేక్షించారు. సర్వే జరుపుతున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నయ్య, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ నర్సింగరావు

అయిజ, నవంబర్ 6 : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు ఎన్యుమరేటర్లను ఆదేశించారు. మండలంలోని ఉప్పల, ఉత్తనూర్ గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి సర్వేను బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఒక ఇంట్లో ఇద్దరు లేదా ముగ్గురు అన్నదమ్ములు ఉంటూ వంట వేర్వేరుగా చేసుకున్నట్లయితే ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటయ్య పాల్గొన్నారు.

ఇంటింటికీ స్టిక్కర్లు అంటిస్తున్న సిబ్బంది

వడ్డేపల్లి, నవంబర్ 6 : కుటుంబ సర్వేలో భాగంగా ప్రత్యేకంగా నియమించిన ఎన్యుమనేటర్లు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. అలాగే ఇండ్లకు స్టిక్కర్లు అంటిస్తున్నారు. మూడురోజులు ఇదే కార్యక్రమం చేపడతామని 9నుంచి 24వ తేదీ వరకు పూర్తి వివరాలు సేకరిస్తామన్నారు. ఎంపీడీవో రామకృష్ణ గ్రామాల్లో పర్యవేక్షణ చేశారు. అయితే కొన్ని గ్రామాల్లో సర్వేకు ఎప్పుడు వస్తారనే సమాచారం సక్రమంగా ఇవ్వనందున కూలి పనులకు పోవాలా, ఇండ్ల వద్దే ఉండాలా అని రైతులు సంశయంతో పడ్డారు.

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

ఇటిక్యాల మండలంలో..

ఇటిక్యాల, నవంబర్ 6 : సమగ్ర కుటుంబ సర్వే బుధవారం మండలంలో ప్రారంభమైంది. మండల కేంద్రంతో పాటు నక్కలపల్లె గ్రామంలో చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని తాసీల్దార్ నరేందర్ పరిశీలించారు. ఉమ్మడి మండలంలో 15,312కుటుంబాలు ఉండగా ఎర్రవల్లి మండలంలో 51 బ్లాకులు, ఇటిక్యాల మండలంలో 38 బ్లాకులుగా విభజించినట్లు ఎంపీడీవో మహ్మద్ అజర్ మైయిద్దీన్ తెలిపారు. సర్వే చేపట్టేందుకు 89మంది ఎన్యుమరేటర్లు నియమించామని, వీరందరూ 8వ తేదీలోగా ఇంటింటి సర్వే చేపట్టి అదనంగా ఇంకా ఏవైనా కుటుంబాలు ఉన్నాయా అని గుర్తిస్తారని తెలిపారు. అనంతరం 9వతేదీనుంచి కుటుంబాల యొక్క పూర్తి సమాచారాన్ని ఎన్యుమరేటర్లు సేకరిస్తారని తెలిపారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150నుంచి 175 కుటుంబాల పూర్తి సమాచారం సేకరించాల్సి ఉంటుందన్నారు.

సర్వేను పరిశీలించిన డీపీవో

మల్దకల్, నవంబర్ 6 : మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా అధికారులు గ్రామాల్లో తమకు కేటాయించిన ఇండ్లకు వెళ్లారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ యజమాని వివరాలను అడిగి తెలుసుకొని ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించారు. ఈ సర్వేను డీపీవో శ్యాంసుందర్ పరిశీలించారు. మండలంలోని తాటకుంట, పెద్దపల్లి అమరవాయి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈయన వెంట ఎంపీవో రాజశేఖర్ ,కార్యదర్శులు పాల్గొన్నారు. కుటుంబ సర్వేకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఆంజనేయరెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 97 బ్లాకులు కాగా 14,961 ఇండ్లు ఉన్నాయి. సర్వేలో భాగంగా 6నుంచి 8వ తేదీ వరకు ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటిస్తున్న సిబ్బంది 9 నుంచి కుటుంబ వివరాలను సేకరిస్తారని తెలిపారు.

ఉప్పలలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

తాటికుంటలో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో శ్యాంసుందర్

ఆలూరులో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి గోవిందయ్య

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు ఉండొద్దు

- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చిన్నారెడ్డి

పెద్దమందడి, నవంబర్ 6 : గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని మోజర్ల, పామిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ వడ్లకు మద్దతు ధర ఏ గ్రేడ్ రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ. 2,300 ఇస్తుందని, సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. రైతన్నలకు కావాల్సిన గన్నీ బ్యాగులను కొరత లేకుండా సప్లయ్ చేయాలని ఉన్నతాధికారులకు ఫోన్‌లో మాట్లాడి ఆదేశించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంఈవో సైదు లుయాదవ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సత్యారెడ్డి, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సర్వేలో సమగ్ర వివరాలను సేకరించాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

అమరచింత, నవంబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కుటుంబ సర్వే నిర్వహిస్తుందని, సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికీ తిరిగి తప్పులు లేకుండా కుటుంబ సమగ్ర వివరాలను సేకరించాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మున్సిపాలిటీ లోని ఎనిమిదో వార్డులో బుధవారం నిర్వహిస్తున్న సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ వివరాల సేకరణలో ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యూసు ఫ్‌తో పాటు వార్డు అధికారులు, అధికారులు ఉన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

పెద్దమందడి, నవంబర్ 6 : కుల గణన సర్వేను అధికారులు, ఎన్యుమరేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. బుధవారం కుల గణన సర్వే ప్రారంభం కాగా మండలకేంద్రంలో ఆయన పర్యటించారు. ఎంతమంది ఇండ్లకు స్టిక్కర్లు వేశారో లిస్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కుటుంబానికి సంబంధించిన మొత్తం ఒకే దగ్గర ఉండాలని, తల్లిదండ్రులు కొడుకు కొడలు వేర్వేరుగా ఉంటే ఇంకో రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రామాలలో సర్వే నిర్వహించే అధికారులు, ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సద్గుణ, తాసీల్దార్ సరస్వతి, పంచాయతీ కార్యదర్శి, సర్వే అధికారులు తదితరులు ఉన్నారు.

అమరచింతలో సర్వేపై వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెద్దమందడిలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ప్రారంభమైన కుల గణన సర్వే

వనపర్తి టౌన్, నవంబర్ 6 : సమగ్ర కుటుంబ సర్వే జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా 1,392 ఎన్యుమరేషన్ బ్లాక్‌లు ఉండగా 1,392 మంది ఎన్యుమరేటర్లను ప్రభుత్వం నియమించింది. 10మంది సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ఎన్యుమరేటర్లకు ఉత్తర్వులు అందజేసి వార్డు మ్యాప్‌లు అందజేశారు. ఆయా బ్లాక్‌ల వారీగా వార్డులను విభజించుకొని ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు వేసుకొని ఈనెల 9 నుంచి సర్వే చేపట్టనున్నారు.

బండ్ల రాజశేఖర్‌రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత కుర్వ విజయ్‌కుమార్

గద్వాల అర్బన్, నవంబర్ 6 : మైనర్ బాలిక వడ్డె రాజేశ్వరి మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్ రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం బండ్ల రాజశేఖర్ రెడ్డి తరఫున వాదించిన న్యాయవాది గద్వాల ప్రజలు, పోలీస్‌లను తప్పుదారి పట్టించడమే కాకుండా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని కూడా తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజేశ్వరి బాల్య వివాహం చేయడానికి ప్రయత్నించడం వల్లనే ఆత్మహత్య చేసుకుందని హైకోర్టులో తప్పుడు అఫిడవిట్ అందజేయడంపై తీవ్రంగా వ్యతిరేకించారు. మీ వేధింపుల కారణంగా మృతి చెందిన బాలికపై అసత్య ఆరోపణలను సృష్టించడం సిగ్గుచేటన్నారు. పరారీలో ఉన్న బండ్ల రాజశేఖర్‌రెడ్డి పట్టుకోవడంలో పోలీస్ శాఖ జాప్యం చేస్తుందని, అధికార పార్టీ నాయకుల ఒత్తిలకు పోలీస్ శాఖ నిస్సాయస్థితిలో వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా బండ్ల రాజశేఖర్‌రెడ్డిని పట్టుకొని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు.

అధికారంలో ఉండి అభివృద్ధిని అడ్డుకుంటారా?

- పెబ్బేరు మున్సిపల్ పాలకవర్గం సూటి ప్రశ్న

మాట్లాడుతున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

పెబ్బేరు, నవంబర్ 6 : మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగనీయకుండా అధికార కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటోందని పాలకవర్గం ఆరోపించింది. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు సుమతి, పార్వతి మాట్లాడారు. అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి పట్టణ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేయించారని వారు గుర్తు చేశారు. రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ వంటి పనులను చేపట్టగా..కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ పనులు నిలిచిపోయాయన్నారు. దీంతో ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారని, రాజకీయ కారణాల వల్లే ఈ పనులను నిలిపివేయడం శోచనీయమన్నారు. పుష్కలంగా నిధులు ఉన్నా అధికారులు చొరవ తీసుకోకుండా..రాజకీయ వత్తిళ్లకు గురై పనులు పూర్తి చేయడం లేదని వారు విమర్శించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాము ప్రత్యక్ష కార్యచరణకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. చేపట్టిన పనులను పూర్తి చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

30ఏండ్లు నిండిన వారందరికీ వైద్య పరీక్షలు చేయాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, నవంబర్ 6: ఈ ఏడాది చివరి నాటికి జిల్లాలోని 30 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ మధుమేహ వ్యాధి పరీక్షలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలపై బుధవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఉచిత మధుమేహ పరీక్షల నిర్వహణ కార్యక్రమాన్ని మరిన్ని పీహెచ్‌సీలకు విస్తరించి డిసెంబర్ చివరి నాటికి పేద, ధనిక అనే సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ ఉచిత మధుమేహ పరీక్షలు పూర్తిచేయాలని ఆదేశించారు. వైద్య సేవల నిమిత్తం గర్భిణుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వందశాతం జరగాలని, ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకునే గర్భిణుల వివరాలు సేకరించి వారి వివరాలు సైతం నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో ఆయుష్మాన్ భారత్ నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. శ్యామ్ మ్యామ్ పిల్లల ఆరోగ్యం పై ప్రోటోకాల్ ప్రకారం వైద్య సేవలు అందించి జిల్లాలో శ్యామ్ మ్యాబ్ పిల్లల సంఖ్య తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆశ కార్యకర్తలకు వారి నిర్ణీత నమూనా దిన చర్య పుస్తకాలను అందజేశారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర జయచంద్రమోహన్, సహాయ అధికారి డాక్టర్ బి.శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ పరిమళ, డాక్టర్ రామచంద్రారావు, డాక్టర్ ఝాన్సీ, పిహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఆత్మకూరు, నవంబర్ 6 : రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఆత్మకూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌యార్డ్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యంలో తేమ శాతాన్ని పకడ్బందీగా పరీక్షించాలని ఆదేశించారు. కేంద్రాల్లో తప్పనిసరిగా ఫ్యాన్లు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా డిజిటల్ కాలిబర్ మీటర్ ద్వారా సన్నాలను పరీక్షించారు. తాలు పరీక్షించే విషయంపై పీపీసీ ఇన్‌చార్జిలకు మరోసారి సమగ్రంగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. వరి కోతలు నిర్వహించే హర్వేస్టర్ యజమానులతో సమావేశం ఏర్పాటుచేయాలని, వరి కోతల అంశంపై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులు రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టవద్దని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సుబ్బారెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం ఇర్ఫాన్, డీసీఎస్‌వో కాశీ విశ్వనాథ్, తాసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీ వో సుజాత, పీఏసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, మున్సిపల్ కమిషనర్ శశిధర్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గద్వాల రూరల్, నవంబర్ 6 : జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జోనల్‌స్థాయి క్రికెట్ అండర్-17 విభాగంలో క్రీడాకారులను ఎంపిక చేసినట్లు డీవైఎస్‌వో బీఎస్ ఆనంద్ అన్నారు. ఈ క్రీడా ఎంపికలకు ఉమ్మడి జిల్లాలోని ఐదు జిల్లాల నుంచి 200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు అంకితభావంతో క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు. క్రీడలు మానసిక, శారీరక అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. ఆయా జిల్లాల నుంచి ప్రతిభ ఆధారంగా 24మంది బాలురు,16మంది బాలికలను ఎంపిక చేశారు. అదేవిధంగా హాకి ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక సోమనాద్రి స్టేడియంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, హాకి అసోసియేషన్ అధ్యక్షుడు కౌన్సిలర్ త్యాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, బీసన్న, నర్సింహరాజు, ఆనంద్‌కుమార్, ఆయా జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల, బాలికలకు చెస్ క్రీడల ఎంపికలు

వనపర్తి టౌన్, నవంబర్ 6 : జిల్లాకేంద్రంలో అండర్-14,17 బాల, బాలికల చెస్ క్రీడాకారుల ఎంపిక ఉంటుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీబాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ ఎంపికలు ఉంటాయని, ఆసక్తి గల క్రీడాకారులు గురువారం ఉదయం 9గంటల లోగా ఇండోర్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని, క్రీడాకారులు పాఠశాల యొక్క ఒరిజినల్ బోనఫైడ్, ఆధార్ జిరాక్స్‌తో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు శివకుమార్ 93462 56641 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, **IBRAHIM HUSSAIN** S/o **MAHBOOB HUSSAIN,** R/o H.No. 1-8-71/C, TD Gutta Firestation, Mahboobnagar Town & Dist, my old name is **MOHAMMED IBRAHIM MAHBOOB HUSSAIN** S/o **MAHBOOB HUSSAIN,** I have changed my name as **IBRAHIM HUSSAIN** S/o **MAHBOOB HUSSAIN.**

CHANGE OF NAME
I, **SAMAIRA MAHBOOB** D/o **MAHBOOB HUSSAIN,** R/o H.No. 1-8-71/C, TD Gutta Firestation, Mahboobnagar Town & Dist , my old name is **SAMAIRA** D/o **MAHBOOB HUSSAIN,** I have changed my name as **SAMAIRA MAHBOOB** D/o **MAHBOOB HUSSAIN.**

CHANGE OF NAME
I, **MALAK MAHBOOB** D/o **MAHBOOB HUSSAIN,** R/o H.No. 1-8-71/C, TD Gutta Firestation, Mahboobnagar Town & Dist, my old name is **MALAK MOHAMMED** D/o **MAHBOOB HUSSAIN,** I have changed my name as **MALAK MAHBOOB** D/o **MAHBOOB HUSSAIN.**

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కావలెను
★**నిరుద్యోగ యువతి, యువకులకు** జీవితంలో ఆర్థికంగా స్థిరపడే గొప్ప వ్యాపార అవకాశం (పార్ట్ టైం/ఫుల్ టైం) కలదు. ఆసక్తి గల వారు వెంటనే సంప్ర||సెల్: 6281742143
NTK-335017

WANTED HELPERS
★**హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు** ''హెల్పర్లు'' కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం||లు. No Consultency, Direct Job. Contact: 9885283513.
NT-335863_All

CHANGE OF NAME
★I, **AFREEN KHANAM** (Old Name) W/o. ABDUL HAMEED KHAN, R/o. H.No: 2-1-260, STREET: DUBBA WADA, Mandal: METPALLY-505325, District Jagtial, Telangana, Have changed my name as **AFREEN NAAZ.**
NTK-325733

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

బాలికకు వేధింపులు.. తండ్రి సూసైడ్?

- కాలనీలో మైనర్‌పై యువకుడి అసభ్య ప్రచారం
- అవమానాన్ని తట్టుకోలేక తండ్రి బలవన్మరణం?

గద్వాల అర్బన్, నవంబర్ 6 : బాలికపై ఓ యువకుడు ప్రేమ పేరుతో వేధించడమే కాకుండా.. కాలనీలో అసభ్యంగా ప్రచారం చేస్తున్నాడు. అవమానంగా భావించిన బాలిక తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. గద్వాలకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత సోదరుడి కుమారుడు.. స్థానికంగా ఉన్న బాలిక వెంటపడుతూ ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి పరశురాముడు(40).. తన బిడ్డ జోలికి రావొద్దని యువకుడిని పలుమార్లు హెచ్చరించాడు. యువకుడి బంధువైన కాంగ్రెస్ నేతతోపాటు అతడి సోదరుడి దృష్టికి తీసుకెళ్లాడు. మార్కెట్ కమిటీకి చెందిన రాజకీయ నేతతో పంచాయితీ పెట్టించినా సదరు యువకుడు తీరు మార్చుకోలేదు. బాలికను మరింతగా వేధింపులకు గురిచేశాడు. కాలనీలోని పలువురితో బాలిక గురించి అసభ్యకరంగా మాట్లాడుతూ నిందలు మోపాడు. దీంతో బాలిక తండ్రి అవమానంగా భావించి బుధవారం రైల్వే పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిసింది. ఈ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైలు ఢీకొంటే తీవ్ర గాయాలు కావాలి. కానీ శరీరంపై పెద్దగా గాయాలు కనిపించలేదు. అతడిని హత్య చేసి రైల్వే ట్రాక్‌పై పడేసి ఉంటారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో పరశురాముడిది హత్యా? లేక ఆత్మహత్యా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేయాలని మృతుడి కుటుంబసభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

రాజీకి ప్రయత్నాలు?

పరశురాముడి మరణంతోపాటు బాలిక వేధింపుల విషయం బయటకు పొక్కకుండా కాంగ్రెస్ నాయకుడు పరపతిని ఉపయోగించి డబ్బులు ముట్టజెప్పి చేతులు దులుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. పరశురాముడి కూతురుపై నిందలు మోపడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని రైల్వే కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. ఈ విషయం తమ దృష్టికి రాలేదని గద్వాల పోలీసులు చెప్పారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

అయిజ, నవంబర్ 6 : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్పులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు చేస్తున్న మోసాలను బీఆర్‌ఎస్వీ విద్యార్థి కమిటీలతో ఎండగడుతామని హెచ్చరించారు. బుధవారం అయిజ పట్టణంలోని జూనియర్ కళాశాలల్లో నూతన బీఆర్‌ఎస్వీ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కుర్వ పల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన స్కాలర్ షిప్ విడుదల చేసే వరకు పోరాడుతామన్నారు. ఆరు గ్యారెంటీల్లో యువ వికాసం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. అనంతరం కళాశాలల బీఆర్‌ఎస్వీ కమిటీలను ఎన్నుకున్నారు. ప్రభుత్వ కళాశాల అధ్యక్షుడిగా తిరుమలేశ్, హరిహర కళాశాల కమిటీ అధ్యక్షుడిగా మహేశ్, అరోరా కళాశాల కమిటీ అధ్యక్షుడిగా ఉపేంద్రగౌడ్‌ను ఎన్నుకున్నట్లు పల్లయ్య ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు మత్తాలి, టౌన్ అధ్యక్షుడు మాల వీరేశ్, రాజు, ప్రకాశ్, రవి పాల్గొన్నారు.

అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీఆర్‌ఎస్వీ నూతన కమిటీని ఎన్నుకుంటున్న కుర్వ పల్లయ్య

ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి

- గద్వాల జిల్లా జడ్జి గంటా కవిత

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 6 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాకారం చేసుకోవాలని గద్వాల జిల్లా జడ్జి గంటా కవిత తెలిపారు. పదోపటాలంలో అదనపు కమాండెంట్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం సాయుధ చైతన్య పాఠశాల, జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సైబర్ నేరాలు, సమాచారం హక్కుచట్టం, పోక్సో తదితర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు చౌహాన్, నరేందర్‌రెడ్డి, ఆర్ఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటేశ్, డీసీపీవో నర్సింహులు, సాయుధ చైతన్య పాఠశాల హెచ్‌ఎం షాషావలి, ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమార్‌తోపాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి

పాన్‌గల్, నవంబర్ 6: యాసంగి పంట సాగుచేసే రైతన్నలకు సరిపడా సాగునీరు అందించాలని కాంగ్రెస్ యువ నాయకుడు జూపల్లి అరుణ్ కోరారు. మండలంలోని మాధవరావుపల్లి, దావూత్కాన్‌పల్లి గ్రామాలను బుధవారం ఆయన సందర్శించి సాగునీటి విషయంపై రైతులతో మాట్లాడారు. ఆయా గ్రామాల మీదుగా వెళ్లే కేఎల్ఐ డిస్ట్రిబ్యూటర్-28 కాల్వను బైక్‌పై వెళ్లి పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖ అధికారులతో జూపల్లి అరుణ్ ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. కాల్వ ద్వారా సాగునీరు సాఫీగా ముందుకు వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రవి, మాజీ ఎంపీపీ వెంకటేశ్‌నాయుడు, విండో మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, నాయకులు రాముయాదవ్, మధుసూదన్‌రెడ్డి, బాలరాజు యాదవ్, వహీద్, విష్ణు, రామకృష్ణ పాల్గొన్నారు.

చేప పిల్లల విడుదలతో ఉపాధి

- జిల్లా మత్స్యశాఖ అధికారిణి షకీలాబాను

అయిజ, నవంబర్ 6 : నదులు, రిజర్వాయర్లు, చెరువుల్లో చేప పిల్లల విడుదలతో మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని జిల్లా మత్స్యశాఖ అధికారిణి షకీలాబాను అన్నారు. బుధవారం అయిజ పట్టణానికి సమీపంలోని బింగిదొడ్డి చెరువు (మినీ ట్యాంక్ బండ్)లో అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్పతో కలిసి జిల్లా మత్స్యశాఖ అధికారిణి 2.25 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం శేషమ్మ చెరువు, ఆచార్యుల చెరువులో చేప పిల్లలు విడుదల చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్, లక్ష్మీదేవి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ధరెన్న, నాయకులు షేక్షావలి ఆచారి, కౌన్సిలర్ దేవరాజు, సంఘం కార్యదర్శి కృష్ణ, సంఘం నాయకులు వెంకటన్న, నల్లన్న, తాయప్ప, భీమన్న పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు

ధరూరు, నవంబర్ 6 : ఫోన్‌పే చేస్తానని చెప్పి దుకాణాదారుల వద్ద డబ్బులు తీసుకొని డబ్బులతో ఉడాయించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ షుకూర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలకేంద్రంలో ఈనెల 5 తేదీ ఉదయం ఓ యువకుడు ఓవ్యాపారి వద్దకు వెళ్లి వస్తువులను ఆర్డర్ ఇచ్చాడు. వస్తువులకు సంబంధించిన బిల్లుతో పాటు కొంత అదనంగా లిక్విడ్ అమౌంట్ ఇస్తే మొత్తం డబ్బులను ఫోన్‌పే చేస్తానని మాయమాటలు చెప్పి డబ్బులు తీసుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ వ్యక్తిపై వ్యాపారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.